ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 9 సెప్టెంబరు 2024

వక్రతుండ మహాకాయ..



రాయచోటి పట్టణంలో సర్పవాహనంపై కొలువైన గణనాథుడు

● వాడవాడలా కొలువైన గణనాథులు ● వైభవంగా వినాయకచవితి ఉత్సవాలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 8: దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. కరుణించయ్యా దేవ.. జిల్లాలోని వాడ వాడలా కొలువైన గణనాథులు విశేష పూజలందుకున్నారు. శనివారం వినాయకచవితి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి వీధిలోని గణనాథుడిని ప్రతిష్ఠించి ఆ ఉత్సవ కమిటీ వారు విశేష పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన నిలువెత్తు వినాయకుడి విగ్రహాల వద్ద ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మమ్మల్ని చల్లగా చూడవయ్యా బొజ్జ గణపయ్య అంటూ వేడుకున్నారు. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అన్నిచోట్లా గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలతో పాటు హోమాలు చేశారు. గణనాథుడు కొలువైన మండపాల వద్ద శని, ఆదివారాల్లో విశేష పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టికొట్టే కార్యక్రమాలతో పాటు చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. లడ్డూల వేలం పాటలు ఉత్సాహంగా జరిగాయి. పలుచోట్ల వేలాది రూపాయలకు పాట పాడగా కొన్నిచోట్ల లక్ష రూపాయలకు పైగా వేలం పాట పాడి లడ్డూలను దక్కించుకున్నారు. రాజంపేట మండలం వైబీఎన్ పల్లె గణనాదుని లడ్డూ వేలం పాటలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు 1.05 లక్షల రూపాయలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. కాగా సోమవారం మూడవ రోజు చాలాచోట్ల వినాయక విగ్రహాల ఊరేగింపులతో పాటు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



మదనపల్లెలోని దేవళంవీధిలో..



వాల్మీకిపురం పట్టణంలో కొలువైన గణనాథుడు



మదనపల్లెలోని దిగువ కురవంకలో చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



పీలేరు యల్లమంద క్రాసులో..



నందలూరులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

ముగ్గురు ఎస్‌ఐల అటాచ్‌మెంట్?

ములకలచెరువు, సెప్టెంబరు 8: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్‌ఐలను ఆదివారం అటాచ్‌మెంట్ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రి, తంబళ్లపల్లె ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి, కురబలకోట మండలం ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌లను అటాచ్‌మెంట్ చేసినట్లు సమాచారం. ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రిని రాయచోటి మహిళా పోలీస్‌స్టేషన్, ముదివేడు, తంబళ్లపల్లె ఎస్‌ఐలు దిలీప్‌కుమార్, లోకేశ్ రెడ్డిలను రాయచోటి డీఎస్పీ కార్యాలయం, పీలేరు పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేసి తక్షణం రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వీరి అటాచ్‌మెంట్‌కు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ నరసింహుడును ములకలచెరువు, తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జిగా, మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ రహీముల్లాను ముదివేడు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో వీరు అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. అటాచ్‌మెంట్ విషయంపై తదుపరి ఎస్పీ ఎలాంటి ఆదేశాలు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 8: విజయవాడను అల్లకల్లోలం చేసిన వరదను జాతీయ విపత్తుగా ప్రకటించి వెంటనే రూ.5 వేల కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి విజయవాడ గుండెకాయ లాంటిదని, బుడమేరు వరద వల్ల తీవ్రంగా దెబ్బతిందన్నారు. మళ్లీ కోలుకోవాలంటే కేంద్రం ఉదారంగా ఆదుకోవాలన్నారు. కడప రేణిగుంట జాతీయ రహదారి అతి ప్రధానమైందని, 2023లో టెండరు పూర్తయిందని, లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ టెండరు దక్కించుకుని 11 నెలలైనా పనులు మొదలు పెట్టలేదన్నారు. కడప- బెంగళూరు మ్యాచ్ గ్రాంట్‌ను జగన్ ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల అర్థాంతరంగా పనులు నిలిచాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

బాలికపై లైంగిక దాడి

రైల్వేకోడూరు(రూరల్), సెప్టెంబరు 8: మండలంలో ఆదివారం 10 సంవత్సరాల బాలికపై మద్యం మత్తులో శివ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వినాయకచవితి పండుగ సందర్భంగా గణేశ్ మండపంలో పిల్లలతో ఆడుకుంటున్న బాలికను తన తల్లి పిలుస్తోందని తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు గమనించి ఆ యువకుడికి దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు : ఇరువురి మృతి





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుభాన్, రమణ (ఫైల్‌ఫొటోలు)

సిద్దవటం, సెప్టెంబరు 8: సిద్దవటం మండలం చాముండేశ్వరిపేట వద్ద ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఒంటిమిట్ట నుంచి పాల ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని కడపకు వెళుతుండగా చాముండేశ్వరిపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఒంటిమిట్టకు చెందిన రమణ (46) అక్కడికక్కడే మృతి చెందాడు. ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒంటిమిట్ట మండలం సాలాబాదుకు చెందిన ఆటోడ్రైవర్ సుభాన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ రాజశేఖర్, సాయి మధుసూదన్, వెంకటసుబ్బయ్య, వెంకటరమణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

డీసీసీ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్



రాయచోటి టౌన్/సుండుపల్లె, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సుండుపల్లి మండలం ముడుంపాడు గ్రామ పంచాయతీకి చెందిన గాజుల భాస్కర్‌ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గాజుల భాస్కర్ 2014లో రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2024 మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ ఆశించినా ఆయనకు దక్కలేదు. ఆ కారణంగానే రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడిగా అన్నమయ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తారని ఆశించిన కాంగ్రెస్ అధిష్ఠానం గాజుల భాస్కర్‌ను అధ్యక్ష పదవికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుండుపల్లి మండలంలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ప్రారంభమైన బాలాలయ దర్శనం

● కోదండరామాలయ గర్భాలయం మూసివేత



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8: కోదండరామాలయంలో ఆదివారం భక్తులకు బాలాలయ దర్శనం కల్పించారు. రెండు రోజుల పాటు బాలాలయ పూజలను టీటీడీ ఆగమ అర్చకులు రాజేష్‌బట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల సమయంలో రామాలయంలోని కల్యాణమండపం వద్ద ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా హోమగుండంలో ఉత్సవమూర్తుల నుంచి సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు, ఆవు నెయ్యితో హోమాన్ని నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను రామాలయంలో ప్రదక్షిణం చేయించి ఆగమశాస్త్ర ప్రకారం బాలాలయ సంప్రోక్షణ నిర్వహించి నూతన ఆలయంగా రామాలయం పోలిన ధ్వజస్తంభం, బలిపీఠం నమూనాలను ఏర్పాటు చేసి అందులో విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్, సీఐ కృష్ణంరాజునాయక్, టీటీడీ ఏఈ అమర్‌నాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి విగ్రహాలతో రామాలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

అధిక కమీషన్ దండుకుంటున్నారు!

● టమోటా రైతుల ఆవేదన ● రోడ్డుపై బైఠాయించి నిరసన.. దిగి వచ్చిన వ్యాపారులు

కలకడ, సెప్టెంబరు 8: కలకడ టమోటా మార్కెట్‌లో మండీల యజమానులు, వ్యాపారులు అధిక కమీషన్ వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వ్యాపారుల తీరును నిరసిస్తూ ఆదివారం మార్కెట్ ఎదురుగా కలకడ-గుర్రంకొండ మార్గంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియచేశారు. కార్యక్రమానికి కలకడ, కలికిరి, కేవీపల్లె, సంబేపల్లె మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఖరీఫ్‌లో టమోటా పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పంట సాగు ఖర్చు భారీగా పెరిగి పంట చేతికి వచ్చే నాటికి ఎకరాకు రూ.2.5 లక్షలు ఖర్చు వస్తోందన్నారు. అయితే ఈ సీజన్‌లో తెగుళ్లు, ధరల పతనం పట్టిపీడుస్తున్నాయని, దీంతో రైతులు నష్టపోయి అప్పుల బాటలో పయనిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో పండిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తరలిస్తే మోసాలకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తాము చెప్పిందే వేదంగా ధరలను శాసిస్తున్నారని తెలిపారు. 15 కిలోల క్రేట్ ధర రూ.500 పలికితే అందులో 10 శాతం కమీషన్‌తో పాటు అదనంగా మరికొంత తగ్గించి పట్టీ చేతికిస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దయతలచి మార్కెట్ యార్డును నిర్మించి న్యాయం చేయాలని కోరారు. రైతులు ఆకస్మికంగా నిరసనకు దిగడంతో వ్యాపారులు దిగి వచ్చారు. ఎలాగో వారికి నచ్చచెప్పి రైతులకు అనుకూలంగా ఉంటామని చెప్పడంతో శాంతించారు. కాగా పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



కలకడలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గురుకులాల్లో అప్పుల కుప్పలు

● ఉద్యోగులకు సక్రమంగా అందని జీతాలు ● పేరుకుపోయిన పాలు, కూరగాయలు, కరెంటు బిల్లులు ● వైసీపీ పాలనలో పెరిగిపోయిన అప్పులు

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు వారికి భోజన, వసతి ఉచిత సదుపాయాలతో అన్నీ ఒకేచోట అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నెలకొల్పిన అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం కూడా మిన్నకుండిపోయింది. దీంతో జిల్లాలో ఆరు వేలకు పైగా విద్యార్థులు చదువుతున్న 11 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో నిర్వహణ కష్టంగా మారిపోయింది. కనీసం విద్యార్థుల భోజనానికి అవసరమైన సరుకులు, కూరగాయలు, పాలు, కోడిగుడ్లు, చికెన్, గ్యాస్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు.



బి.కొత్తకోటలోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల



వాల్మీకిపురంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8: జిల్లాలో 11 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రైల్వేకోడూరు, రామాపురం, బి.కొత్తకోట మండలాల్లో బాలుర గురుకుల పాఠశాలలు ఉండగా మదనపల్లె, ఆడపూర్ (రాజంపేట), లక్కిరెడ్డిపల్లె, దేవపట్ల, రాయచోటి, పీలేరు, వాల్మీకిపురం, బురకాయలకోట వద్ద బాలికల గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో 6 వేల మంది వరకు విద్యార్థినులు ఐదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్నారు. వీరందరికీ భోజనాలు, వసతి తదితర ఖర్చులు ప్రభుత్వమే భరిస్తోంది. దీనికి అదనంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు జీతాలు, ఆప్కాస్ ఉద్యోగుల వేతనాలు వెరసి ఒక్కో గురుకుల పాఠశాలకు నెలకు ఎంత లేదన్నా రూ.65 లక్షలు ఖర్చు వస్తుంది. మొత్తం మీద 11 గురుకుల పాఠశాలలకు నెలకు ఖర్చు రూ.7.15 కోట్లు వస్తోంది.

జీతాలు లేవు.. బిల్లులు అందలేదు

జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందడం లేదు. ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలు పడుతున్నా, అవి కూడా అంతంత మాత్రమే. ఇక హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణకు అవసరమైన కూరగాయలు, పాలు, కోడిగుడ్లు, చికెన్, సరుకులు, గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం టెండర్లను పిలిచింది. ఈ టెండర్లు పాడుకున్న వారు సరుకులు, కూరగాయలు తదితరాలు సరఫరా చేయాల్సి ఉంది. వీరికి మార్చి నెల వరకు మాత్రమే బిల్లులు పడ్డాయి. మిగిలిన ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. దీంతో టెండర్లు దక్కించుకుని సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ క్రమంలో వారు సరఫరా చేసే సరుకులు, వస్తువుల నాణ్యత తగ్గినట్లు అనుమానాలు వస్తున్నాయి. బియ్యం మాత్రం సివిల్ సప్లైస్ గోదాము నుంచి సరఫరా చేస్తున్నా, నాణ్యత తక్కువగా ఉండటంతో అన్నం ముద్దకడుతోంది.

నెలకు రూ.7.15 కోట్లు ఖర్చు

అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సుమారు 6 వేల మంది విద్యార్థులకు గాను ఒక్కో గురుకుల పాఠశాలకు నెలకు కోడిగుడ్లకు రూ.9 లక్షలు, పాలకు రూ.13 లక్షలు, కూరగాయలకు రూ.8.8 లక్షలు, గ్యాస్‌కు రూ.5.04 లక్షలు, సరుకులకు రూ.22 లక్షలు, చికెన్‌కు రూ.7.68 లక్షలు మొత్తం కలసి రూ.65 లక్షలు ఖర్చు వస్తోంది. దీంతో పాటు హాస్టల్, మెస్‌లు, పాఠశాల తరగతి గదుల్లో విద్యుత్ వినియోగానికి బిల్లులు అదనం. వీటికి అదనంగా హాస్టళ్లలో మరమ్మతులు, ఉద్యోగుల జీతాలు, వేతనాలు కలిపి నెలకు ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే విడుదల చేస్తుండగా ఇక్కడ మరమ్మతుల ఖర్చు చూస్తే ఎక్కువగానే వస్తోంది. ఈ ఖర్చులను భరించేందుకు నిర్వాహకులు ఎవరైనా దాతలు, లేకుంటే ఉపాధ్యాయులే తమ సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. మొత్తం మీద మార్చి నెల నుంచి ఇప్పటి వరకు ఆరు నెలలకు గాను వేసవి సెలవులు పోను నాలుగున్నర నెలల్లో కాంట్రాక్టర్లకు సుమారు రూ.32.17 కోట్లు బకాయిలు పడ్డారు.

ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో పెండింగే కారణం..

జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఉద్యోగులకు ఆప్కాస్ ఉద్యోగులకు మూడు నెలల జీతాలు, వేతనాలను చెల్లించేశాము. ఆగస్టు నెలది మాత్రమే పెండింగ్‌లో ఉంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనికోసం ఇక్కడి నుంచి అన్ని బిల్లులను సిద్ధం చేసి హెడ్‌ఆఫీసుకు పంపాము. అక్కడ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో పెండింగ్‌లో ఉండటంతో బిల్లులు ఆలస్యం అవుతున్నాయి. త్వరగా వచ్చేందుకు కృషి చేస్తాం.

- మాధవీలత, డీసీవో,
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, కడప

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం..

పేరుకుపోయిన బకాయిలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రాష్ట్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించాల్సి ఉంది. ఈ క్రమంలో మార్చి నుంచి సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. దీనికి గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర గ్రాంట్స్ కింద నిధులు విడుదల చేయకపోవడంతో కేంద్రం కూడా మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేదని తెలిసింది. దీంతో పర్మినెంట్ ఉపాధ్యాయులు, ఆప్కాస్ ఉద్యోగులకు కూడా జీతాలు సక్రమంగా మంజూరు చేయలేదు. మే, జూన్, జూలై, ఆగస్టు నెలలకు గాను వేతనాలు పెండింగ్‌లో ఉండగా, రాష్ట్రంలో ఉమ్మడి కూటమి అధికారంలోకి వచ్చాక మూడు నెలల జీతాల బకాయిలను ఉద్యోగులకు చెల్లించారు. కేవలం ఆగస్టు నెలది మాత్రమే పెండింగ్ ఉంది.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి


మహేశ్ మృతదేహం

రాయచోటి టౌన్, సెప్టెంబరు8: స్థానిక చిత్తూరు రోడ్డులో టీవీఎస్ షోరూం వెనుక భాగాన వినాయక మండపం వద్ద విద్యుదాఘాతంతో మహేశ్ (12) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.... ప్రకాశం జిల్లా దర్శి వాసి వల్లారమ్మ కుటుంబం సంచార జీవనం గడుపుతూ స్టీల్ వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వల్లారమ్మ పెద్ద కుమారుడు రాయచోటి ప్రాంతంలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉండడంతో వల్లారమ్మ కూడా పిల్లలతో కలిసి రాయచోటిలోనే పది నెలలుగా ఉంటోంది. ఈ క్రమంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని టీవీఎస్ షోరూం వెనుక వైపున వినాయక ప్రతిమ ఏర్పాటు కోసం మండపాన్ని సిద్ధం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వినాయకుడి ప్రతిమ తీసుకొచ్చిన అనంతరం పిల్లలంతా కలిసి అక్కడ డీజే డాన్స్ ప్రోగ్రాం చేస్తున్నారు. ఇంతలో ఓ మోస్తారు వర్షం కురుస్తుండడంతో మండపానికి ఏర్పాటు చేసిన డెకరేషన్ విద్యుత్ వైరు కడ్డీకి తగిలి మహేశ్ మృతి చెందాడు. బాలుడు మృతి చెందడంపై తల్లి వల్లారమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు....


షేక్ షారిక్ మృతదేహం

వల్లూరు, సెప్టెంబరు 8: కడప - తాడిపత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ షారిక్ (13) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కడప అల్మాస్‌పేట వాసులు ముగ్గురు ద్విచక్ర వాహనంలో కమలాపురం నుంచి కడపకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యక్తి గుద్దడంతో కమలాపురం నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనంలో ముగ్గురు ఉండగా వెనక కూర్చున్న షేక్ షారిక్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఇతని తండ్రి మహ్మద్ అబ్దుల్ షరీఫ్ గల్ఫ్‌లో ఉన్నట్లు వారి మేనమామ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే దాని పట్ల అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో పొలతల భజంత్రీ మధుబాబు....



పెండ్లిమర్రి, సెప్టెంబరు 8: పొలతల మల్లేశ్వరస్వామి ఆలయంలో పని చేస్తున్న జి.మధుబాబు (భజంత్రి) అనారోగ్యంతో మృతిచెందారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎం.కృష్ణానాయక్, ఎస్.రాజారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు దేవస్థానం తరపున రూ.15000 అందించారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింక కళేబరం

రామాపురం, సెప్టెంబరు8: కుక్కల దాడిలో ఏడాది వయసున్న జింక శనివారం మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భరణికుమార్ తెలిపారు. శనివారం అటవీ ప్రాంతం నుంచి కిందికి రావడంతో కుక్కలు వెంబడించి రామాపురం మండల కేంద్రానికి సమీప సరస్వతిపల్లె క్రాస్ రోడ్డు ప్రాంతంలో కుక్కల దాడిలో జింక మృతి చెందిందన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు జింకను స్వాధీనం చేసుకుని ఆదివారం పశువుల వైద్యాధికారి మహేశ్ పోస్టుమార్టం జరిపిన అనంతరం ఫారెస్టు సిబ్బంది అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 8: ఆశా కార్యకర్తలకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, వైసీపీ ప్రభుత్వంలో ఆశాల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోని ఒప్పంద జీఓలు విడుదలయ్యేవరకూ ఆశా వర్కర్ల రిటైర్మెంట్లను నిలపాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ మాట్లాడుతూ జిల్లాలోని మొరగుడి, తాళ్ళపల్లి, పెద్దముడియం, ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు పని చేయాలని మెడికల్ ఆఫీసర్లు ఆశాలను ఒత్తిడి చేస్తున్నారని చెయ్యకపోతే ఉద్యోగాలు మానుకోవాలన్నారు. మెమోల ద్వారా వేధించడం మానుకోవాలన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, మహిళా నాయకురాలు వరలక్ష్మి, అనసూయ, అమ్ములు, అనిత, సుధారాణి, పలువురు పాల్గొన్నారు.

వరద బాధితులకు అంజుమన్ సహాయం

రూ.10 లక్షల నగదు, 4 టన్నుల బియ్యం సహా సామగ్రి


మాట్లాడుతున్న వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8: విజయవాడ వరదబాధితుల సహాయం కోసం అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మసీదుల్లో విరాళాలు సేకరించినట్లు మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ హాల్లో మసీదుల నుంచి సేకరించిన బియ్యం కందిబేడలు, ఇతర సామగ్రిని అంజుమన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. సోమవారం ఉదయం వీటిని విజయవాడలోని వరదబాధితులకు అందజేయడం కోసం ఇక్కడి నుంచి లారీలో వీటిని తరలిస్తామని తెలిపారు. పట్టణంలోని ముస్లింలు స్వర్ణకారులు మార్కెట్ వ్యాపారులు అందరు కలిసి దాదాపు 10 లక్షలకు పైగా నగదు విరాళాలు ఇచ్చారన్నారు. ఆపదలో వున్న మనుషులకు ఆదుకోవడం మానవధర్మం అన్నారు. ప్రాంతాలు ఏవైనా మనుషులకు కష్టం వస్తే వారిని కుల మత ప్రాంతాలకు అతీతంగా సహాయం చేయడం ఆదుకోవడం అభినందనీయమన్నారు. అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షుడు బొల్లారం బాషా మాట్లాడుతూ విజయవాడలో వచ్చిన వరదలతో జనజీవనం అతాలాకుతలమైందన్నారు. ప్రభుత్వం చేసే సహాయ కార్యక్రమాలు, మానవ సమాజం స్పందించాలన్నారు. అందులో భాగంగా అంజుమన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించామన్నారు. వీటిని కలెక్టరుకు అందజేస్తామన్నారు. వీటిని సోమవారం తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్ మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, సీనియర్ న్యాయవాది దాదాపీర్, మాజీ ఖాజీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

నల్లపురెడ్డిపల్లెలో ఇద్దరికి తీవ్ర గాయాలు - 10 దూడలు మృతి


చికిత్స పొందుతున్న చంద్రకళమ్మ

పెనగలూరు, సెప్టెంబరు 8: నల్లపురెడ్డిపల్లె పంచాయతీలో ఆదివారం తెల్లవారు జామున పిచ్చికుక్క స్వైరవిహారం చేసి చంద్రకళమ్మ అనే వృద్ధురాలిని తీవ్రంగా గాయపరచడంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. హరిజనవాడలో చిన్నయ్యపై దాడి చేయడంతో ఆయన చేతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఐదు రోజులుగా గ్రామంలో చేసిన దాడిలో ఇప్పటికే 10 దూడలు మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. లెక్కలేనన్ని కోళ్లను చంపిందని తెలిపారు. ఇంట్లో నిద్రిస్తున్న చంద్రమ్మపై దాడిచేసి కాళ్లు, చేతులపై తీవ్రంగా గాయపరచడంతో ఆమె పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. ఆమెను రాజంపేట ఆస్పత్రికి అక్కడి నుంచి కడపకు, కడప నుంచి తిరుపతికి రెఫర్ చేయడం, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు కుక్కలపై చర్యలు తీసుకుని వాటిని పట్టుకుని ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం



సమస్యల నడుమ ఝురికోన ప్రాజెక్టు ● మరమ్మతులకు ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుండుపల్లి, సెప్టెంబరు 8: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా సుండుపల్లి మండల రైతుల పరిస్థితి తయారైంది. ఝురికోన ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఝురికోన ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది. కనీసం కాల్వల నిర్మాణానికి కూడా నోచుకోక పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కూమార్ రెడ్డి పాలనలో జలాశయం నుంచి కంభంవారిపల్లి, కలికరి తదితర మండలాలకు తాగునీటి పథకం మంజూరు చేసి పూర్తి చేశారు. సుండుపల్లి రైతాంగం కోసం బాహుదానదిలో కాల్వలు ఏర్పాటు చేయని కారణంగా ఈ ప్రాంతీయులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. కొన్నేళ్లగా పూర్తి చేస్తామని ప్రజాప్రతినిధుల హామీలు నీటిమీద రాతలయ్యాయి. జలాశయం తూము మరమ్మతులకు గురై ఏడేళ్లయినా పనులు జరగక పోవడం గమనార్హం. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లి, సంబేపల్లి ప్రాంతాల తాగు, సాగునీటి కోసం ఝురికోన ప్రాజెక్టు నిర్మించారు. అయితే సుండుపల్లి రైతాంగం కోసం బాహుదానదిలో కాల్వలు ఏర్పాటు చేయని కారణంగా ఈ ప్రాంత ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. ప్రాజెక్టు దిగువ భాగంలో సాగు నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో బాహుదా జలసాధన జలసంరక్షణ సమితి పోరాటాలతో తూమును ఏర్పాటు చేశారు. దాదాపు ఏడేళ్ల కిందట తూముగేటుకు ఏర్పాటు చేసిన అనుబంధ కడ్డీ విరిగి పోయింది. అప్పట్లో గేటు తొలగించి బాహుదా నదిలోకి నీరు పోకుండా, ప్రాజెక్టులో నీరు నిలిచేలా తూములోకి నీరు రాకుండా కాంక్రీటు వేశారు. ఏడేళ్లవుతున్నా గేటు మరమ్మతులను పట్టించుకోలేదు. కరవుతో రైతులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఏడాది జూలైలో కరవు పరిస్థితులతో సాగు నీరులేక ఇబ్బందులు పడుతున్నామని కూటమి నేతలు, నీటి పారుదలశాఖ అధికారుల దృష్టికి సుండుపల్లి మండల రైతులు తీసుకుపోయి నదిలోకి సైపన్ పద్ధతిలో ప్లాస్టిక్ పైపుల ద్వారా నీటిని విడుదల చేశారు. జలాశయ నీరు దిగువకు వచ్చేలా చేశారు. 15 రోజుల తరువాత గుర్తుతెలియని వ్యక్తులు ప్లాస్టిక్ పైపులను కత్తిరించారు. కాల్వల నిర్మాణానికి ఆలస్యమైనా గేటు ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం..రైతులకు శాపం

దశాబ్దలుగా కాల్వల ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రత్యక్షంగా 5 వేల ఎకరాల సాగుభూమికి నీటిని అందించే అవకాశంవున్నా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎటువంటి ముందడుగు పడలేదు. అప్పట్లో కనీసం సమస్యను అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఎంపీ, ఎమ్మెల్యేలు తీసుకుపోలేక పోయారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారేకానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్ని సార్లు రైతులు, ప్రజా సంఘలు, ప్రతిపక్ష పార్టీలు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. కాల్వలు ఏర్పాటైతే మండలంలోని సగం మంది రైతులకు సాగు నీటి సమస్య లేకుండా పోతుంది. ఇదంతా తెలిసినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాల్వలు ఏర్పాటు చేయాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

నూతన వ్యయంతో ప్రతిపాదనలు

ఏడాది కిందట రూ.59 లక్షలతో ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి అప్పట్లో అనుమతులు రాలేదు. ప్రభుత్వం మారింది. నూతన వ్యయంతో ప్రతిపాదనలు పంపించాల్సి వుంది. త్వరలో ప్రతిపాదనలు పంపి గేటు పునరుద్ధరణకు కృషి చేస్తాము. ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేశాము.

వెంకట్రామయ్య,
కార్యనిర్వహణాధికారి, జిల్లా జలవనరులశాఖ


మట్టి, కాంక్రీట్‌తో తూము మూసిన వైనం


మరమ్మత్తులకు నోచుకోని తూము గేటు

అనుమతించారు - అడ్డుకున్నారు

కడప రిమ్స్ దంత వైద్యశాల ఆవరణ డీజే సౌండ్ ● డీజేలను ఆపివేయాలన్న పోలీసులు

పోలీసులతో వాగ్వాదం ● ఆందోళన చేసిన వైద్యవిద్యార్థులు

కడప డీఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్

కడప (క్రైం), సెప్టెంబరు 8: చవితి వేడుకలో భాగంగా ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో పోలీసుల అనుమతితోనే వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేసుకుని డీజేలు పెట్టుకున్నామని, పోలీసులు వచ్చీ రావడంతోనే తమను అడ్డుకున్నారని వైద్యవిద్యార్థులు ఆరోపించారు.

కడప నగరం రిమ్స్ ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో వైద్యవిద్యార్థులు వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ డీజేలు ఏర్పాటు చేయడంతో రిమ్స్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన చివరికి ఆందోళనకు దారి తీసింది. పోలీసులు అనుమతితోనే తాము వినాయక ప్రతిమను ఏర్పాటు చేసుకుని డీజేలు పెట్టుకున్నామని, పోలీసులు వచ్చీ రావడంతోనే తమను అడ్డుకున్నారని వైద్యవిద్యార్థులు ఆరోపించారు. దీంతో ఔట్ పోస్టు పోలీసుస్టేషన్ వద్ద వైద్యవిద్యార్థులు ఆందోళనకు దిగారు. పోలీసు అధికారిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తమ వంతు కృషి చేశారు. పెద్దపెద్ద సౌండ్‌లతో డీజే సౌండ్‌లో పాటలు పెట్టి రోగులకు ఇతర ఆస్పత్రిలో ఉన్న వారికి ఇబ్బందులు కలుగుతాయని ఎస్ఐ సౌండు తగ్గించాలని సూచించడంతో ఈ సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆదివారం పోలీసులు, వైద్య విద్యార్థులు, వారి అధికారులను అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు కడప డీఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. అనంతరం ఇరువైపులా విచారించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 8: స్థానిక బైపాస్‌రోడ్డులో శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి బి.వెంకటేశ్వర్లు(39) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొల్లపల్లె వాసి వెంకటేశ్వర్లు తన స్నేహితుడితో వినాయకుడి బొమ్మను తీసుకువెళ్లేందుకు బద్వేలుకు వచ్చారు. బొమ్మను తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌కింద పడ్డాడు. స్నేహితులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

ఎస్పీ బంగ్లా వద్ద కూలిన కటౌట్

తృటిలో తప్పిన ప్రమాదం


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కటౌట్

కడప (క్రైం), సెప్టెంబరు 8: కడప నగరంలోని ఎస్పీబంగ్లా నుంచి రాజారెడ్డివీధి వైపు వెళ్లే రోడ్డు ప్రారంభంలోనే కుడివైపున వినాయకచవితి శుభాకాంక్షలు పేరుతో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఆదివారం మధ్యాహ్నం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు కానీ, వాహనదారులు, పాదచారులు కానీ ఆ దారిన ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. సంఘటన జరిగిన వెంటనే స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు హడావుడిగా వచ్చి కడప నగర పాలక సంస్థ వారికి సమాచారం ఇచ్చారు.

పది మంది జూదరుల అరెస్ట్

వీరబల్లి, సెప్టెంబరు8: హరిజనవాడ, రాగిమానిదిన్నెపల్లె సమీపంలో జూదమాడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వంగిమళ్ల పంచాయతీ పెద్ద హరిజన వాడ వద్ద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2600 నగదును, సంఘంవాండ్లపల్లె పంచాయతీ రాగిమానిదిన్నెపల్లె వద్ద ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓ నేతపై దుండగుల రెక్కీ ?

కడప (క్రైం), సెప్టెంబరు 8: కడప నగరం అల్మాస్‌పేటలో షోరూం నిర్వహిస్తున్న ఓ నేతపై దుండగులు రెక్కీ నిర్వహించారంటూ అర్ధరాత్రి పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా, అలాంటి దేమీ జరగలేదంటూ పోలీసులు భావిస్తున్నారు. తనపై దాడి చేస్తారని తన అనుచరులకు వచ్చిన ఫోన్ సమాచారం వరకే పోలీసుల దృష్టికి తెచ్చినట్లు ఆ నేత అధికారులకు వివరించినట్లు సమాచారం. ఎవరు, ఎందుకు రెక్కీ నిర్వహించారో స్పష్టమైన సమాచారం ఎవరి వద్ద లేనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆ ఎనిమిదిన్నర సెంట్లు ఏమైనట్లు?

కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్న మాజీ సర్పంచ్


ఆక్రమణకు గురైన పాఠశాల స్థలం ఇదే

చెన్నూరు, సెప్టెంబరు 8: కొండపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిదిన్నర సెంట్లు ఆక్రమణకు గురైంది. దీంతో పాఠశాలకు ఆటస్థలం లేకుండాపోయింది. దాతలు ఇచ్చిన పదహైదున్నర సెంట్ల స్థలంలో కేవలం ఏడుసెంట్లు మాత్రమే ఉండడం, మిగతా ఎనిమిదిన్నర సెంట్లు లేకపోవడంతో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటైన ప్రాథమిక పాఠశాలకు గతంలో 1971న 185/6లో 10 సెంట్లను కె.పెద్దసుబ్బయ్య, 185/6లో మరో దాత 3 సెంట్లు, 1984లో ఖాదర్‌మొహిద్దీన్‌సాబ్ రెండున్నర సెంట్లను పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. అందులో పాఠశాల నిర్మాణం అయింది. దాదాపు 50 ఏళ్లుగా నడిపే ఈ పాఠశాలకు సంబంధించి పదహైదున్నర సెంట్లలో క్రమేపీ ఎనిమిదిన్నర సెంట్లు ఆక్రమణకు గురి కాగా ఏడుసెంట్లు మాత్రమే మిగిలాయి. అందులో పాఠశాల, అంగన్వాడీ కేంద్రం నిర్మించారు. దీంతో ఆక్రమణకు గురైన స్థలం ఏమైందీ, తిరిగి దానిని పాఠశాలకు ఇప్పించేలా చూడాలని మాజీసర్పంచ్ మోహన్‌రెడ్డి కలెక్టరుకు సోమవారం గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సమస్యను మండల టీడీపీ నేతగా తాను ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణగురైన స్థలాన్ని తిరిగి పాఠశాలకు ఇప్పించాలని గతంలో ఎమ్మెల్యేకు తెలిపినట్లుగా ఆయన అన్నారు.

వరాలతల్లి... మరియ

ఆరోగ్యమాత ముగింపు ఉత్సవాల్లో బిషప్ గాలి బాలి


బిషప్ గాలి బాలిని సత్కరిస్తున్న ఫాదర్లు

కడప (కల్చరల్) సెప్టెంబరు 8: విశ్వాసులకు దీవెనలు, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించే వరాల తల్లి మరియ అని కడప అపోస్తులిక పాలన అధికారి, బిషప్ గాలి బాలి అన్నారు. పది రోజులుగా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన పూజా ప్రార్థనలు జరిగాయి. చివరిరోజు ఆదివారం ముగింపు ఉత్సవాల్లో ఆయన ఆరోగ్యమాత సందేశాన్ని అందించారు. కడప నగరంలో ఆరోగ్యమాత వెలసి వుండడం రాయలసీమ ప్రాంతానికే ఆశీర్వాదకరమన్నారు. ఆరోగ్యమాత నవదిన పూజా ప్రార్థనలకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా విశ్వాసులు హాజరై దీవెనలు అందుకోవడం సంతోషంగా వుందన్నారు. ఆ తల్లి శరణుకోసం పవిత్ర మనసుతో రోజూ కుటుంబాల్లో ప్రార్థన, జపమాల చేయాలని కోరారు. అనంతరం గాలిబాలికి గురువులు, అమ్మవార్లు, చర్చిపెద్దలు, యువత, శాలువా, గజమాలతో శాంతిసేవా సొసైటీ జ్ఞాపికతో సత్కరించారు.

కార్యక్రమంలో మేత్రాసన వికర్ జనరల్ ఫాదర్ బాలరాజు, కోశాధికారి ఫాదర్ సురేష్, పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ప్రసాద్‌రావు, మేత్రాసన గురువులు, అమ్మవార్లు, మేత్రాసన ఉజ్జీవక ఉపదేశులు, చర్చిపెద్దలు, యువత, అధికసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో స్థలాల వివాదం



బేస్‌మెంట్ రాళ్లు పక్కన పడవేసిన దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8: గండికోటకు వెళ్లే దారి ఒంటిమిద్దె గ్రామ సమీపాన ప్రధాన రోడ్డు పక్కన పూర్వపు బొమ్మేపల్లె జగనన్న లేఅవుట్ స్థలాల్లో ఆదివారం వివాదం చోటు చేసుకుంది. సీఐ లింగప్ప వివరాల మేరకు బొమ్మేపల్లె వాసులు ముద్రా రాజశేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి సహా మరో నలుగురు జగనన్న లేఅవుట్‌లో ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మెంట్ రాళ్లను పునాది కోసం తీసిన మట్టి, రాళ్లను పెకిలించినట్లు పలువురు గ్రామస్థులు స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే సమస్యను పరిశీలించేందుకు తమ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు సీఐ తెలిపారు. అక్కడ పెద్దబాలిగారి లక్ష్మిదేవి, దేవి బేస్‌మెంట్, పునాది రాళ్లకు సంబంధించి పక్కకు తీసి పడవేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. సర్వే నంబరు 381, 382లో 180 ప్లాట్లు అప్పట్లో అధికారులు లేఅవుట్లు వేసినట్లు 40 నుంచి 44 మందికి పట్టాలు ఇచ్చినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. అయితే సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ గ్రామస్థులతో మాట్లాడి ప్రస్తుతం ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తామని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి విజయవాడకు వెళ్లాడని, మూడు రోజులు గడువు ఇస్తున్నామని తహసీల్దారు వచ్చిన వెంటనే పట్టాలకు సంబంధించి రికార్డు పరిశీలించి జరిగిన ఘటనకు సంబంధించి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన, పోలీసు సిబ్బంది, బొమ్మేపల్లె బాధిత ప్రజలు పాల్గొన్నారు.

'పొలానికి రీసర్వే నిర్వహించాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: బొజ్జవారిపల్లెలో ఉన్న తమ పొలానికి రీ సర్వే నిర్వహించాలని బుర్రి బాలయ్య కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 291/1బి, 291/2బిలలో 73 సెంట్ల పొలం ఉందన్నారు. జగనన్న సర్వేలో తనకు 4 సెంట్లు స్థలం వస్తుందని సర్వేయర్ చెప్పారని తెలిపారు. అయితే కొత్త పొలం యజమానుల ఒత్తిడితో సర్వేయర్, వీఆర్వోలు హడావిడిగా సర్వే నిర్వహించి తమ భూమిని 10 సెంట్లు ఆక్రమించి సరిహద్దు రాళ్లు పాతడం దారుణమన్నారు. వీఆర్వో, సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి పొలానికి రీ సర్వే చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బుర్రి బాలయ్య సతీమణి వెంకటసుబ్బమ్మ, కుమారుడు నాగేంద్ర పాల్గొన్నారు.



వీరబల్లి: పూజలందుకుంటున్న వినాయకుడు


రామాపురంలో..


రైల్వేకోడూరు: వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


పెనగలూరు: వినాయకుడి సన్నిధిలో భక్తులు


పుల్లంపేట: పూజలందుకున్న విఘ్నేశ్వరుడు


ఒంటిమిట్ట రజక వీధిలో పూజలందుకుంటున్న గణనాథుడు

ఓ బొజ్జ గణపయ్యా.. పూజలందుకోవయ్యా..

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8: పట్టణంతో పాటు రాయచోటి మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, గాలివీడు రోడ్డులోని లక్ష్మీపురంలో టీడీపీ నేత పెరికల రెడ్డెన్న ఆహ్వానం మేరకు పూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి , తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజంపేట: పట్టణంలోని ఎర్రబల్లె, మన్నూరు, రామ్‌నగర్, సాయినగర్, నారంరాజుపల్లె, గడ్డివీది, కొలిమివీధి, గుప్తానగర్, ఎన్టీఆర్ కాలనీ, విద్యానగర్, కూచివారిపల్లె, ఊటుకూరు, తాళ్లపాక తదితర ప్రాంతాల్లో గణనాథులకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని 30 వార్డుల్లో వందకు పైగా మండపాలు ఏర్పాటు చేశారు అన్నిచోట్ల అన్నదానం చేశారు. ఎర్రబల్లె, మన్నూరు ప్రాంతంలో శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులు, చిన్నారులు కోలాటం, భక్తి గీతాలాపన, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. శాంతి నగర్, అమ్మవారిశాల వీధి, పట్టణంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, తదితరులు గణనాథుడకి పూజలు నిర్వహించారు. ఎర్రబల్లె సాంస్కృతిక వేదికల టీటీడీ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఈ గణేష్ ఉత్సవాలు మన ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయలకు భక్తిభావాలకు ఒక ప్రతీక అని కొనియాడారు.

రైల్వేకోడూరు: కొత్తబజారులో పాములు పెనవేసుకున్నట్లుగా వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేయడంతో అందరిని ఆకట్టుకుంది. అదే విధంగా పాతబజారువీధిలో వినాయకుడిపై శివుడు తిరుగుతున్నటుగా, వినాయకుడు కళ్లు తెరిచి మూసుకున్నట్లుగా ఏర్పాటు చేశారు. అటు వెళుతున్న భక్తులను ఈ రెండు వినాయకుడి విగ్రహాలు ఆకటుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె, అనంతపురం, చౌటపల్లి, రవీంద్రనగర్, కుర్నూతల గ్రామాల్లో మంత్రి సోదరుడు, మండిపల్లి ట్రస్టు చైర్మన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్ మోహన్, రాజంపేట పార్లమెంట్ డాక్టర్ సంఘం ప్రధాన కార్యదర్శి షఫీనాయక్, కావలి ఆంజనేయులు, వేణు, రామచంద్ర, పక్కీరయ్య, రెడ్డిశేఖర్, వేమయ్య, మురళి, గురుస్వామి, వెంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా గణనాథులు కొలువుదీర్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తున ఏర్పాటు చేశారు.

రామాపురం: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు.

చిట్వేలి: మండలంలో 140 ప్రాంతాల్లో భక్తులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. చిట్వేలి సత్యమ్మవీధి, సింగనమలవీధి, తుమ్మచెట్ల పల్లెలో ఏర్పాటు చేసిన విగ్రహాల పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి పూజలు చేశారు. ఎస్‌ఐ రఘురాం మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించు కోవాలన్నారు..

చిన్నమండెం: మండలంలోని కుర్వపల్లెలో వినాయక మండపం వద్ద మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి టెంకాయ కొట్టి అన్నదానం ప్రారంభించారు. అనంతరం శ్రీరామాలయంలో పూజలు నిర్వహించారు.

పెనగలూరు: మండల కేంద్రంలోని కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఉత్సవాలు కాణిపాకం బ్రహ్మోత్సవాలను తలపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 60 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పెనగలూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఇండ్లూరులో ఉన్న సిద్ధి వినాయక స్వామి దేవాలయంలో కూడా 3 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తుండగా, కొత్తపల్లెలో 10 రోజులు నిర్వహించనున్నారు

వీరబల్లి: వాడవాడలా వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి కాయకర్పూరాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. కొన్ని గ్రామాల్లో అన్నదానం చేశారు.

ఒంటిమిట్ట: మండలవ్యాప్తంగా పెద్దఎత్తున విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల వద్ద చిన్నపిల్లలకు ఆటలు, మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. కల్లావీధిలో అన్నదానం చేశారు. టీడీపీ, పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వడ్డించారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఆర్‌ఎస్ రోడులోని సుబ్బారావు హోటల్ వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక స్వామి విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉట్టి కార్యక్రమంలో బోనాసి వంశీ విజేతగా నిలిచి 25 గ్రాముల వెండిని కైవసం చేసుకున్నారు. డాక్టర్ చిన్నిసుబ్రమణ్యం, రేగిమడుగు సుబ్బారావు, పుత్తా కోటేశ్వరరావు, పుత్తా నాగేశ్వరరావు, చిన్ని విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేట మండలంలో శనివారం వినాయకచవితి వేడుకలను వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుల్లంపేట, సీతారాంపేటల్లో అన్నదానం, పుత్తనవారిపల్లెలో విఘ్నేశ్వర మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండ్రాలయ్యా ఉంటామయ్యా...

సంబేపల్లె: ఉండ్రాలయ్యా.. ఉంటామయ్యా... అంటూ ఆదివారం పీఎస్‌కాలనీ నగిరిలో కొలువుదీరిన గణనాథుడతిని చెక్కబజనలు, కోలాటాలు నడుమ గ్రామంలో ఊరేగించి సమీపంలోని గంగలో నిమజ్జనం చేశారు. మండల వ్యాప్తంగా ఆదివారం వినాయక ప్రతిమల వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. చెక్కభజనలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని కొత్తపేట హనుమాన్ వీధిలో వినాయక మండపం ఏర్పాటు చేసిన చిన్నారులు ఆదివారం నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువత రంగులు చల్లుకుంటూ చిందులు వేస్తూ సందడిగా వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.


రాయచోటి: లక్ష్మీపురంలో వినాయకుడి విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సతీమణి హరితారెడ్డి


లక్కిరెడ్డిపల్లె: లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉత్సవ నిర్వాహకులు


వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

వైబీఎన్‌పల్లె లడ్డూ రూ.1.05 లక్షలు


గణనాథుడి లడ్డూను దక్కించుకున్న బాసినేని వెంకటేశ్వర్లునాయుడు దంపతులు

రాజంపేట, సెప్టెంబరు 8: రాజంపేట మండలం వైబీఎన్‌పల్లెలో గణనాథుడి మండపంలో నిర్వహించి లడ్డును ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేత బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు 1.05 లక్షలకే వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో బసినాయుడు గారి పల్లె వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాకతీయ జిల్లా సేవా సమితి అధ్యక్షుడు శివన్నారాయణచౌదరి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు

రాజంపేట, సెప్టెంబరు 8 : స్థానిక రాయచోటి రోడ్డులోని కూచివారిపల్లె కృష్ణమ్మ చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ నాయకుడు వెంకటయ్యనాయుడు మాట్లాడుతూ సుమారు 100కు పైబడి గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వర్షాలు లేనందున తమ గ్రామ పరిధిలోని కృష్ణమ్మ చెరువులో పెద్ద గుంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉట్టి పోటీ విజేత బోనాసి వంశీ

నందలూరు, సెప్టెంబరు 8 : మండలంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామి విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉట్టి కార్యక్రమంలో బోనాసి వంశీ విజేతగా నిలిచి 25 గ్రాముల వెండిని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిన్నిసుబ్రమణ్యం, రేగిమడుగు సుబ్బారావు, పుత్తా కోటేశ్వరరావు, పుత్తా నాగేశ్వరరావు, చిన్ని విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు, సెప్టెంబరు 8 : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రంట మోస్తరు వర్షం కురిసింది. పెనుగాలులు వీచాయి. వీటి కారణంగా కలిగిన నష్టం వివరాలు తెలియరాలేదు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సిద్దవటం, సెప్టెంబరు 8 : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మాధవరం-1 గ్రామంలోని భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల దేవస్థానంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి బోగాబత్తిన సుబ్బమ్మ, రెండో బహుమతి జొన్నాదుల ఉమాదేవి, మూడో బహుమతి బొడిచెర్ల సంధ్యరాణి గెలుపొందారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. గ్రామంలోని మహిళలు, ఆలయ పెద్దలు, గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న మహిళలు

బీసీలకు రాజకీయ గుర్తింపు ఏదీ?

- సుగవాసితో నియోజకవర్గ నేతలు
- టీడీపీ బలోపేతానికి పిలుపు

రాజంపేట, సెప్టెంబరు 8: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతంపై బీసీ నేత, మాజీ కౌన్సిలరు మనుబోలు వెంకటసుబ్బయ్య(మీసాల), మనుబోలు వెంకటేశ్వర్లుతో వారి ఇంట్లో టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదివారం చర్చించారు. ప్రతి మున్సిపల్ ఎన్నికల్లో తమ సామాజిక వర్గానికి చెందిన నలుగురు నేతలు కౌన్సిలర్లుగా ఎన్నికవుతున్నారని, అయినా, తమకు రాజకీయపరంగా ఎటువంటి గుర్తింపు లభించడం లేదని తెలిపారు. తాము గతంలో వైసీపీలో ఉండి తెలుగుదేశంపార్టీలో చేరామన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బీసీ నేత, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మైనార్టీ నాయకులు షేక్ గుల్జార్‌బాషా, సీనియర్ టీడీపీ నాయకులు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, జిల్లా టీడీపీ కార్యదర్శి సంజీవరావు, ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ నవీన్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, భువనగిరిపల్లె నాయకులు టైల్స్ నరసింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీ నారాయణ స్వగృహానికి వెళ్లి పలు విషయాలపై చర్చించారు. టీడీపీ నాయకులు మిట్టమీదపల్లెకు చెందిన నాగేశ్వర్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, రాష్ట్ర బీసీ కార్యదర్శి ఇడిమడకల కుమార్, న్యాయవాది రమణ, ఊటుకూరు నాయకులు నామా హరి, అగ్రహారం నాయకులు సుధాకర్, అబ్బిగారి గోపాల్, మాజీ న్యాయమూర్తి పలుకూరి రామాంజనేయులు, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణతో పలు విషయాలపై చర్చించారు.


మనుబోలు వెంకటసుబ్బయ్యతో చర్చిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

ఏపీఎండీసీ నిర్వాసితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 8 : ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి ఇళ్లను, భూములను ఇచ్చిన బీసీ సామాజిక వర్గానికి చెందిన 37 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని సీఐటీయూ నేత సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. ఆదివారం మధ్యాహ్నం కొత్త మంగంపేటలో అయ్యపురెడ్డిపల్లె పునరావాస బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 లో ఏపీఎండీసీ అభివృద్ధికి ఇళ్లను, భూములను ఇచ్చిన 37 కుటుంబాలకు 12 ఏళ్ల నుంచి న్యాయం చేయలేదన్నారు. ఇంటిస్థలం కూడా కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారని, అగ్రవర్ణాల వారికి మాత్రం ఇళ్ల స్థలాలు, ప్యాకేజీలు కూడా ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ఏపీఎండీసీ యాజమాన్యం, జిల్లా కలెక్టర్ సాయి, అధికారులు జోక్యం చేసుకుని బీసీ కుటుంబాలకు జరిగిన అన్యాయాన్ని విచారణ చేసి, దీనికి కారణమైన అధికారులను సస్పెండ్ చేసి ఆ కుటుంబాలకు చట్టప్రకారం రావాల్సిన అన్ని హక్కులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అన్నమయ్య జిల్లా నాయకులు ఆర్.వెంకటేశ్, బాధిత కుటుంబాల వారు పాల్గొన్నారు.


న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న నిర్వాసితులు



కోదండరాముడి సన్నిధిలో జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8 : ఒంటిమిట్ట కోదండరామాలయంలోని బాలాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. రామాలయ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపారన్నారు. ముందుగా కుడములూరు నుంచి సోమశిల వెనుకజలాల ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరు చేరుతున్న పైపులైను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిళ్ల శ్రీహరి, రేవిళ్ల బాలమునెయ్య, మోదుగుల నరసింహులు, బీవీ రమణ, మామిళ్ల రామక్రిష్ణయ్య, శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కోదండరామాలయంలో పూజలు చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

11న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పుల్లంపేట, సెప్టెంబరు 8 : మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు తెలిపారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ చెస్ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి పీడీలు, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులు హాజరై విద్యార్థులను తీసుకుని రావాలని వారు కోరారు.

రాష్ట్రంలో కోటి సభ్యత్వాల నమోదుకు శ్రీకారం

రాజంపేట టౌన్, సెప్టెంబరు 8: కోటి సభ్యత్వాల నమోదు ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రారంభించామని బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయి లోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం రాజంపేట పాతబస్టాండు ప్రాంతంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం అంతా సభ్యత్వ నమోదుపై ముమ్మరంగా కసరత్తు చేస్తోందన్నారు. కోటి సభ్యత్వాలను పూర్తి చేసి, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడానికి అన్నివిధాల కృషి చేస్తుందన్నారు. అగ్రరాజ్యంగా రూపొందాలంటే దేశానికి నాలుగోసారి కూడా బీజేపీ నాయకత్వం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సాయిలోకేష్, నాగోతు రమేష్‌నాయుడు

వరద బాధితులకు ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8: వరద బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెంచర్ల ఆంజనేయులు రూ.10 వేలు, సోమలవాళ్లపల్లెకు చెందిన వెంకటకృష్ణయ్య కుమారుడు డోసీ చరణ్ రూ.5,050 రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు తోచిన సహాయం అందించడం మన కర్తవ్యం. బాధితులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో రాయచోటి అధికారులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఐదు రోజులుగా రాయచోటి మున్సిపల్ అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో 30 మంది పారిశుధ్య కార్మికులు పనులు చేస్తున్నారు. విజయవాడలోని తూర్పు కృష్ణలంక 16వ డివిజన్ రూపేష్‌గుప్తానగర్ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, అక్కడ బాధితులకు అవసరమైన పాలు, భోజనం, అత్యవసర మందులు లాంటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పారిశుధ్యం పనులను పర్యవేక్షిస్తున్న రాయచోటి మున్సిపల్ అధికారులు

ఆహారం, తాగునీరు పంపిణీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం రాయచోటి పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్, అమానత్ వెల్ఫేర్ సేవా సొసైటీ సభ్యులు షైనుద్దీన్, అతావుల్లా, మూలింటి సలీం తదితరులు వరద సహాయక చర్యల్లో పాల్గొని పడవల ద్వారా వరద ప్రాంతాలకు వెళ్లి బాధితులకు భోజనం, తాగునీరు, ఇతర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.


వరద సహాయక చర్యల్లో స్వచ్ఛంద సంస్థల సభ్యులు

రూ. 38 వేలు ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8: విజయవాడ ప్రాంతంలో వరద బీభత్సం వల్ల ఎన్నో కుటుంబాలు ఏదైనా పడ్డాయని అలాంటి కుటుంబాలను ఆదుకోవాలని వరద బాధితుల అసోసియేషన్ జేఏసీ నాయకులు యనమల విశ్వనాథ్ వెంకటకృష్ణయ్య, పక్కీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వరద బాధితులకు ఫోన్ పే ద్వారా రూ.38 వేలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులను చేయూతనివ్వాలని వాళ్లు కోరారు. ఈ కార్యక్రమంలో వరద బాధిత సంఘం నాయకులు సుబ్బారెడ్డి, సురేశ్, పక్కీరయ్య, కడియాల వెంకటప్రసాద్, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ 10న రాస్తారోకో

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న నిర్వహించనున్న రాస్తారోకోను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద రాస్తారోకోకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు డీ. విజయమ్మ, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 8 : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని ఎంసీఏ బుల్లయ్య తెలిపారు. రసాయన రహిత సాగును పాటిస్తోటి రైతులను ప్రోత్సహించి మేలైన దిగుబడితో పాటు, ఆరోగ్యం పొందాలని తెలిపారు. ప్రధాన పంటలో తక్కువ కాలంలో ఆదాయం వచ్చే గోంగూర, పాలకూర, ఆకు కూరలు, కూరగాయలు వంటివి పండించడం వల్ల ఆదాయం వస్తుందని తెలిపారు. జీవామృతం, నీమాస్త్రం వంటివి ఎన్నో రసాయన రహిత కషాయాలు ఉన్నాయని రైతులకు ప్రయోగం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలిరెడ్డిపల్లె, చిన్నఓరంపాడు రైతులు పాల్గొన్నారు.


రైతులకు వివరిస్తున్న ఎంసీఏ బుల్లయ్య

'మానవత' ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా శిబిరం

గాలివీడు, సెప్టెంబరు 8: మానవత స్వచ్ఛంద సంస్థ గాలివీడు శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ హాస్పిటల్ తిరుపతి వారి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు చిన్నమండెం మానవతా చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి 200 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షల అనంతరం అందులో 41 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని తిరుపతి అరవింద్ హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత గాలివీడు చైర్మన్ సుబ్బిరెడ్డి, కన్వీనర్ శివారెడ్డి, చంగల్‌రాజు, రామకృష్ణారెడ్డి, శంకర్, రమణారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటేశ్వరు, సాయి, హీరా, వెంకట్రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రారెడ్డి, దామోదర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలకు హాజరైన ప్రజలు

18 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 8: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 40 మందికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు, 18 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 26 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెండి పళ్లెం విరాళం

నందలూరు, సెప్టెంబరు 8 : మండలం లోని నాగిరెడ్డిపల్లెలో ఉన్న వాసవీ కన్య కా పరమేశ్వరి ఆలయానికి రాజంపేటకు చెందిన యచ్చ రమేష్ బాబు, ధర్మపత్ని సుప్రజ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యు లు 650 గ్రాముల వెండిపళ్లెం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంబలూరు నరసింహ శెట్టి, మేడా వెంకటకుమార్, ఎంబలూరు నరసింహప్రసాద్ పాల్గొన్నారు.


ఆలయ అధ్యక్షుడికి వెండిపళ్లెం అందజేస్తున్న దాత

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ పట్టివేత




పట్టుబడిన గ్రానైట్ లారీ, ట్రాక్టర్

గుడుపల్లె, సెప్టెంబరు 8: ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు రాష్ట్రాలకు తరలిస్తున్న గ్రానైట్ వాహనాలను పోలీసులు పట్టుకొన్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. గుడుపల్లె మండలం మీదుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొన్ని రోజులుగా రహదారుల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. శనివారం ఉదయం కుప్పం-పలమనేరు జాతీయ రహదారి, శెట్టిపల్లె సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. వేగంతో వస్తున్న గ్రానైట్ లారీ కంటపడిందన్నారు. లారీని ఆపి.. డ్రైవర్‌ను ప్రశ్నించగా అతడి వద్ద గ్రానైట్ తరలింపునకు సంబంధించిన పత్రాలు ఏవీ లేవు. తమ విచారణలో గ్రానైట్‌ను తమిళనాడుకు తరలిస్తున్నట్లు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. అలాగే పొగురుపల్లె మార్గంలో గ్రానైట్ బ్లాకుతో ట్రాక్టర్‌లో తరలిస్తున్న వాహనాన్ని ఆపగా..ఈ ట్రాక్టర్‌లోని గ్రానైట్ అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. ఈ రెండింటిని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ రెండు గ్రానైట్ వాహనాలను పలమనేరు మైన్స్ ఏడీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

పిచ్చికుక్క వీరంగం

● 10 మందికి గాయాలు



గాయపడిన యువకుడు

పూతలపట్టు, సెప్టెంబరు 8: పూతలపట్టులో ఆదివారం పిచ్చికుక్క దాడిలో దాదాపు 10 మంది గాయపడ్డారు. ఉదయం పోలీసుస్టేషన్ సమీపంలో పిచ్చికుక్క అటుఇటు పరుగులు తీస్తూ కనిపించిన వారందరిపైనా దాడి చేసింది. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8: జిల్లా ఏపీ పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్స్) అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం చిత్తూరులో జిల్లా ఇన్‌చార్జి ఎన్.గురునాథం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామచంద్రన్, ఉపాధ్యక్షులుగా బాబురెడ్డి, రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా కె.బి.నిరంజన్, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా రెహమాన్, కోశాధికారిగా ప్రదీప్, సంయుక్త కార్యదర్శులుగా జయంతి, పురుషోత్తం, పబ్లిసిటీ సెక్రటరీగా ప్రేమ్‌సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కార్తీక్, సుమంత్, ఈసీ మెంబర్లుగా షబీర్, కేబీ పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెలాఖరులోగా మండలాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని తీర్మానించారు.

ద్రవిడ వర్సిటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



పీఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

గుడుపల్లె, సెప్టెంబరు 8: ఓ వైపు జీతాలు రాకపోవడం.. మరో వైపు అప్పుల బాధ తాళలేక ద్రవిడ విశ్వవిద్యాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. కుప్పిగానిపల్లెకు చెందిన రామకృష్ణ(56) ద్రవిడ విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొన్ని నెలలుగా జీతాలు రాలేదు. దీంతో విధులకు హాజరుకావడం లేదు. కుటుంబ పోషణ కోసం కొందరి దగ్గర అప్పులు చేశారు. నెలలు గడుస్తున్నా జీతాలు రాకపోగా అప్పుల వారి నుంచి ఒత్తిళ్ల ఎక్కువయ్యాయి. శుక్రవారం అప్పు ఇచ్చినవారు డబ్బులు అడగడంలో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోని ఓ గదిలో ఉరేసుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించి కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళకరంగా ఉంది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు.

రుయాలో డాక్టర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: రుయాస్పత్రిలోని డాక్టర్లపై దాడి చేసిన కేసులో తిరుపతికి చెందిన ఏడుగురిని వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి 11.30 గంటలకు రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ ముందు పీజీ డాక్టర్లపై విచక్షణా రహితంగా కొందరు దాడిచేశారు. ఈ కేసులో చింతలచేనుకు చెందిన ఏసీ మెకానిక్ షేక్షావలి, షేక్ చాంద్‌బాషా, మునికృష్ణ వసంత్, జె.కృష్ణబాబు, ఎస్.మణి, పి.శివకుమార్, బి.సాయికుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో డీఎస్పీ వెంకటనారాయణ, వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి చింతలచేను రైల్వే ట్రాక్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. అనవసరంగా ఆసత్రుల్లో డాక్టర్లపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ రామకృష్ణ, సిబ్బందిని అభినందించారు.

కుప్పం 'కేంద్రీయ విద్యాలయ'లో కదలిక

● ప్రభుత్వానికి స్థల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు



బైరుగానిపల్లె వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కడా పీడీ తదితరులు (ఫైల్ ఫొటో)

కుప్పం, సెప్టెంబరు 8: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే కుప్పం అభివృద్ధి ఊపందుకుంది. ఒకవైపు విజన్ డాక్యుమెంట్ తుది దశ మెరుగులు దిద్దుకుంటుండగా, మరోవైపు ఇప్పటికే ప్రకటించిన ప్రాజెక్టులు పట్టాలకెక్కుతున్నాయి. కుప్పంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకోసం చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికోసం కలెక్టర్ సుమిత్ కుమార్‌తోపాటు కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దారు చిట్టిబాబు తదితరులు వివిధ ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. చివరకు కుప్పం పురపాలక సంఘం పరిధిలోని బైరుగానిపల్లె ప్రాంతంలో స్థలాన్ని గుర్తించారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి వెనుక వైపున మునిరాజు అనే రైతు భూమిని కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అధికారులు సుమారు 25 రోజుల క్రితం ఎంపిక చేశారు. ఇక్కడ రైతుకు సంబంధించిన 1.40 ఎకరాల పట్టా భూమిలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించి, ఆ రైతుతో చర్చించారు. దీనికి ప్రత్యామ్నాయంగా 2.14 ఎకరాల స్థలాన్ని వేరేచోట ఇస్తామన్న తర్వాత ఆ రైతు అంగీకరించారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని సైతం గుర్తించి, ప్రతిపాదనను సిద్ధం చేసిన స్థానిక రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఆ ఫైల్ పంపారు. అయితే మునిరాజు అనే రైతు తన స్థలాన్ని ముందుగా ప్రభుత్వానికి రిజిస్టర్ చేయాలని, కలెక్టర్‌నుంచి కుప్పం తహసీల్దారు చిట్టిబాబుకు ఇటీవల ఆదేశాలు అందాయి. అలా చేస్తేనే ప్రత్యామ్నాయ స్థలాన్ని రైతుకు అప్పగించి, రిజిస్టర్ చేసేందుకు వీలవుతుందని కలెక్టర్ సూచించారు. దీంతో తహసీల్దారు స్థల యజమాని అయిన రైతు మునిరాజును తన కార్యాలయానికి పిలిపించారు. తొలుత తనకు ప్రభుత్వంనుంచి భూమి రిజిస్ట్రేషన్ చేసిన తర్వాతనే, తన భూమిని ప్రభుత్వానికి రిజిస్టర్ చేస్తానని రైతు చెప్పారు. అయితే తహసీల్దారు ఆయనకు అర్థమయ్యేలా పరిస్థితిని వివరించడంతో తన పేరుమీద ఉన్న భూమిని ప్రభుత్వానికి బదలాయించేందుకు మునిరాజు సంసిద్ధత వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రభుత్వం తరఫున రిజిస్ట్రార్ శాఖకు స్టాంపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలోని స్థలం కావడంతో ఆ ఫీజు లక్షల్లో ఉండే అవకాశం ఉంది. ఈ ఫీజు మొత్తాన్ని ఏ పద్దు కింద చెల్లించాలన్న మీమాంస ప్రస్తుతం నెలకొంది. ఇది తొలగి ఒక స్పష్టత వచ్చాక కేంద్రీయ విద్యాలయ స్థాపనకోసం గుర్తించిన స్థలం, ప్రభుత్వ పరమవుతుంది. ఆపైన విద్యాలయ స్థాపనకు శరవేగంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.



వ్యానును విరాళంగా అందిస్తున్న దాత - లక్ష విరాళంగా అందిస్తున్న దాత

అన్నదాన సత్రానికి వాహన వితరణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8: కాణిపాక క్షేత్రంలో ఆలయ ఆధ్వర్యంలోని అన్నదాన సత్రానికి కూరగాయలు తరలించడానికి వాహనం కానుకగా అందింది. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, జైల్‌సింగ్ వారి మిత్ర బృందం కలిసి రూ.12 లక్షలు విలువ చేసే వాహనాన్ని శనివారం అందజేశారు. అలాగే 2.5 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. దాతలను ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శనం చేయించారు. అలాగే, బంగారుపాళ్యం మండలం కొత్తవెంకటాపురానికి చెందిన మోహన్‌నాయుడు, అన్నదాన కార్యక్రమానికి రూ.1,11,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, అన్నదానం ఏఈవో ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో..

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని చవితి సందర్భంగా శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి, కేంద్ర ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటి కార్యదర్శి ఆశీష్‌గుప్తా తదితరులు స్వామి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం వీరిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందించారు.



లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో గురుప్రసాద్ - ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటీ కార్యదర్శి అశీష్‌గుప్తాకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

58.5 కిలోల గంజాయి పట్టివేత

తిరుపతి జిల్లాలోని పలుప్రాంతాల్లో బాలుడి సహా ఏడుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

గూడూరు, సెప్టెంబరు 8: తిరుపతి జిల్లాలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖపట్నం నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న గుంటూరు జిల్లాకు చెందిన సంజయ్‌కుమార్, ఉమాశంకర్, నీలయ్యలను విచారించారు. విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో విక్రయిస్తున్నట్లు తేలిందని రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో..

వెంకటగిరి టౌన్: కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి తాలుకా విజయపురానికి చెందిన నరసింహరాజు స్టేషన్‌లో శనివారం అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఇతను ఒడిశా నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

తిరుపతిలోనూ..

తిరుపతి(నేరవిభాగం): తిరుపతిలోనూ శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తన సిబ్బందితో కలిసి కొర్లగుంటలో గంజాయి విక్రయిస్తున్న కందాటి సాయిచందు, ఆర్.దేవరాజన్, ఎస్.హరినాథ్ సింగ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగున్నర కిలోల గంజాయితోపాటు మత్తు బిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, సిబ్బంది కలసి తనిఖీలు చేశారు. బొమ్మగుంటలో ఓ బాలుడి (17) వద్ద నుంచి 21 కిలోల గంజాయి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.35 కోట్లు

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండురోజుల్లో రూ.6.35 కోట్లు లభించింది. గురువారం, శుక్రవారం కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.6.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్ర, శనివారాల్లో 1.42 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈరెండురోజుల్లో 53,159 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

విజయవాడకు 150 మంది రెవెన్యూ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయం అందించేందుకు జేసీ విద్యాధరి సహా 150 మంది రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు బయలుదేరి వెళ్లారు. వీరిలో జేసీ విద్యాధరి రెండ్రోజుల క్రితమే వెళ్లగా మిగిలిన వారు శనివారం రాత్రి చిత్తూరు నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం విజయవాడలో రిపోర్టు చేశారు. వీరిలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డితో పాటు 16 మంది తహసీలార్లు, 66మంది డిప్యూటీ తహసీల్దార్లు, 37 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు ఉన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 25 మంది పంచాయతీ సెక్రటరీలు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు వెళ్లినట్లు డీపీవో లక్ష్మి తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా భాస్కర్



వెదురుకుప్పం, సెప్టెంబరు 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా(డీసీసీ) వెదురుకుప్పం మండలం బలిజమొండి వెంగనపల్లికి చెందిన పోటుగారి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలఉత్తర్వులు జారీ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాస్కర్ చెప్పారు. ఈయన నియామకం పట్ల కాపు సంఘ నేత జీకే నాగరాజు, ఆ కాంగ్రెస్ పార్టీ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు హమేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్వీయూ ప్రతినిధుల అమెరికా పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8: ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం అమెరికాకు పయనమైంది. ఈ బృందం 20 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనుంది. ఈ బృందంలో ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, వైరాలజీ ప్రొఫెసర్ హేమ, ఇంగ్లీషు ప్రొఫెసర్ సుమకిరణ్, రుసా ప్రతినిధి వంశీకృష్ణ, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రమాశ్రీ, తదితరులు ఉన్నారు. ఎస్వీయూనివర్సిటీ, అమెరికాలోని ఫార్డ్యూ యూనివర్సిటీల మధ్య ఎంటర్‌ప్రైనర్‌షిప్ (బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పర సహకారం) కల్పించేందుకు ఈనెల ఏడో తేదీన తిరుపతి నుంచి బయల్దేరి వెళ్లినట్లు సమాచారం. చాలాకాలం కిందటే ఈ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నా అనేక కారణాలతో ఆలస్యమైంది. ఈ పర్యటన తర్వాత, అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా త్వరలో ఎస్వీయూనివర్సిటీని సందర్శించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

వేర్వేరు ఘటనల్లో 40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురి అరెస్టు



చక్రాయపేట వద్ద పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 8: తిరుపతి, కడప జిల్లాల్లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి 40 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్ శనివారం తెల్లవారుజామున కరకంబాడి అటవీప్రాంతంలోని తిరుపతి-కడప జాతీయ రహదారిలో ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పారిపోయారు. మరో ఇద్దరిని టాస్క్‌ఫోర్సు బృందం పట్టుకోగలిగింది. పట్టుబడ్డ ఇద్దరు తమిళనాడులోని సేలం జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి కారులోని 12దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. మరో ఘటనలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం కడపజిల్లా చక్రాయపేట వద్ద కూంబింగ్ చేస్తుండగా మాలబీళ్ల వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుంటూ వస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన వారు పారిపోగా ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతను కడపజిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఒకమోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ రెండింటిపై తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఎస్ సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కరకంబాడి వద్ద ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్ మృతి

మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలు




లారీని ఢీకొన్న మరో లారీ - డ్రైవర్ నాగరాజు మృతదేహం

పాకాల, సెప్టెంబరు8: పాకాల మండలం నేండ్రగుంట సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపైన ఆదివారం ఉదయం ఆగివున్న లారీని వెనుకవచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. అదనపు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి వెస్ట్‌బెంగాల్‌కు బ్రిక్స్ లోడుతో వెళ్తున్న లారీ నేండ్రగుంట సమీపంలో శనివారం అర్ధరాత్రి మరమ్మతులకు గురైంది. దీంతో లారీ డ్రైవర్ లారీని రోడ్డు పక్కగా ఆపివేశాడు. ఆదివారం ఉదయం చిత్తూరు వైపు నుంచి భద్రాచలానికి కట్టెల లోడుతో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఆపివుంచిన లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాది కొత్తగూడెం ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ నాగరాజు (24) మృతిచెందాడు. అదనపు డ్రైవర్ సాయిబాబు (45) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అతికష్టంమీద క్యాబిన్ తొలగించి సాయిబాబును బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన ఇతనిని చికిత్సకోసం అంబులెన్స్‌లో తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. మృతిచెందిన నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిచ్చురేపిన 'ర్యాష్ రైడింగ్'

● రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులతో పరిస్థితి ఉద్రిక్తం

● అడ్డుకోబోయిన ఎస్ఐకీ స్వల్ప గాయం ● ఓ ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దం

కేవీబీపురం, సెప్టెంబరు 8: పక్క గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ గ్రామంలో ద్విచక్ర వాహనాలను ర్యాష్‌గా నడపడంపై స్థానిక మహిళలు ప్రశ్నించారు. దీనిపై మాటామాటా పెరిగి రెండు గ్రామాల మధ్య దాడులకు దారితీసి, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రాగిగుంటలో అతివేగంగా చక్కర్లు కొట్టారు. భయపడ్డ స్థానిక మహిళలు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. కాసేపటికి ఆ యువకులు అక్కడినుంచి వెళ్లి తమ గ్రామం సుమారు 30మందిని వెంటబెట్టుకొచ్చారు. దీంతో ఈ గొడవ కాస్తా రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులకు దారితీసింది. ఆదివారం ఉదయం మళ్లీ పెరిందేశంవాసులు మళ్లీ రాగిగుంటకు చేరుకున్నారు. దుకాణాలను ధ్వంసం చేసి, పెరిందేశం గ్రామస్తులపై దాడికి దిగారు. దీంతో రెండు గ్రామాలవారు కొట్లాటకు తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవను అడ్డుకోబోయిన పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్‌పైనా మద్యం సీసాలు విసరడంతో ఎడమ కన్ను వద్ద స్వల్ప గాయమైంది. మరోవైపు రాగిగుంటవాసులు పిచ్చాటూరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఏఎస్ఐ లోకనాథం అండతోనే పెరిందేశంవాసులు దాడి చేశారని ఆరోపించారు. ఈక్రమంలో గుర్తుతెలియని ఆందోళనకారులు అటుగా వచ్చిన శ్రీకాళహస్తి డిపోకి చెందిన బస్సు అద్దాన్నీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రవి మనోహరాచారి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పలువురు సీఐలు, ఎస్ఐలతో ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఈ గొడవతో సంబంధం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, రెండు గ్రామాల్లోనూ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.



నిరసన తెలుపుతున్న రాగిగుంట గ్రామస్తులు

మామ అల్లుళ్లపై వేటుకు సన్నద్ధం

కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మామ అల్లుళ్లపై బదిలీ వేటుకు అధికారులు సన్నద్ధమైనట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులు ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేందుకు వీలుండదు. అయితే ఏఎస్ఐ.. రాజకీయ అండతో తన కుమార్తె భర్త అయిన కానిస్టేబుల్‌ను తాను పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు డీవోగా తెచ్చుకున్నారు. ఈ ఏఎస్ఐ పనిచేసినా ప్రతిచోటా అనేక ఆరోపణలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. నెల కిందట కానిస్టేబుల్ అయిన అల్లుడు ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకుని చెల్లించకపోగా, తప్పుడు కేసు పెడతానంటూ బెదిరించడంపై బాధితుడు 100కు ఫోన్ చేశాడు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కొంత నగదు వసూలు చేయించిన ఘటన కూడా ఆదివారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు ఈ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కూడా నియమించకుండా తానే చక్రం తిప్పుతున్నట్లు ఫిర్యాదు అందాయి. తాజాగా ఇదే ఏఎస్ఐ అండతోనే తమపై దాడి జరిగినట్లు రాగిగుంటవాసులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మామాఅల్లుళ్లను తిరుపతి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి రిపోర్టు చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

పార్వతీ తనయ గణాధిపా

●భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్యకు పూజలు ●వాడవాడలా మండపాలలో ఏర్పాటైన గణనాథులు ●ఊరూవాడా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం


మదనపల్లె కమ్మవీధిలో వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మిట్స్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి


మదనపల్లెలో అయ్యప్పస్వామి అలంకరణలో వినాయకుడు


బి.కొత్తకోటలో గణనాథుడు


పీలేరులో వినాయకుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

మదనపల్లె అర్బన్/టౌన్, సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పార్వతి తనయుడు గణనాథుడికి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. శనివారం ఉదయం మండపాలకు చేరుకున్న గణనాథులను ఆయా మండపాల నిర్వాహకులు, ప్రజలు ప్రతిష్ఠించేసి పూజలు చేస్తున్నారు. ఇందులో కొందరు మూడు రోజుల పాటు పూజలు చేస్తుండగా మరి కొందరు ఐదు రోజులు, ఏడు, తొమ్మి ది, పదకొండు ఇలా వారివారి శక్తి కొలది గణనాథులకు పూజలు చేసి నిమజ్జనం చేయనున్నారు. మదనపల్లె పట్టణం, గ్రామీణా ప్రాంతాల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను శనివారం ప్రతిష్ఠించి పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పట్టణంలో కమ్మవీధి, కమ్మగడ్డవీధి, రెడ్డెప్ప నాయుడు కాలనీ, ఆర్యవైశ్య కళ్యాణమండపం, సిపాయివీధి, కృష్ణానగర్, తూర్పు కొత్తపేట, కనకదాస్‌నగర్, నీరుగట్టువారిపల్లె, గొల్లపల్లె, సుభాస్‌రోడ్డు, దేవళంవీధి, శాస్త్రీవీధి, ఇందిరానగర్, ప్రశాంత్‌నగర్, అమ్మినేనివీధి, బుగ్గకాలువ, వీవర్స్ కాలనీ, రెడ్డీస్ కాలనీ, సొసైటీ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భవానీ ప్రసాద్, మాజీ టౌన్ బ్యాంకు విద్యాసాగర్, సీడ్ మల్లికార్జున, కోర్టులో గంగమ్మ ఆలయం చైర్మన్ మార్పూరి చిన్నరెడ్డెప్ప, చౌడేశ్వరీ ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, ప్రసన్న ఆజంనేయ స్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, తదితరులు గణేశ్ పూజల్లో పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలో, రూరల్‌లలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని దిగువ కురవంక, రెడ్డీస్‌కాలని, దేవళం వీధి, ప్రశాం త్‌నగర్, కృష్ణానగర్, ప్రాంతాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చవితి వేడు కల్లో పాల్గొన్నారు. స్థానిక త్యాగరాజు వీధిలో అయ్యప్పస్వామి అలంకారంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తులసి, రామకృష్ణ, టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్, దిగువ కురవంకలో మార్పూరి వరుణ్, పగడాల యశ్వంత్, రోజా ఫ్లాట్లు, ఎస్‌బీఐ కాలని, రెడ్డెపనాయుడు కాలినిల్లో నాదెళ్ల శివన్న, షంషీర్, సహదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని అన్ని గ్రామాలలో బాజాభజంత్రీల మధ్య శనివారం వైభవంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో వినాయకుడి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు ఈటకట్ట చంద్రశేఖర్ దిగువవీధిలో వెలసిన గణేష్ విగ్రహనికి రూ. 25వేలు, మరి కొన్ని విగ్రహాలకు రూ.15వేలను అందించి ఆయన భక్తిని చాటుకొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో వినాయక చవితి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో సుమారు 60 చోట్ల వినాయక స్వామి విగ్రహాలును భక్తులు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పండుగకు ఉచితంగా మినరల్ వాటర్

పెద్దమండ్యంకు చెందిన కేసీ మురాషా అనే ముస్లిం వినాయక చవితి పండగ సందర్భంగా మూడు రోజులు (తాగునీరు) మినరల్ వాటర్ ఉచితంగా సరఫరా చేసి దాతృత్వం చాటుకుంటున్నాడు. వినాయక చవితి పండగ సందర్భంగా మినరల్ వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చి ఉచితంగా మినరల్ వాటర్ తీసుకుపోచ్చునని గ్రామంలో దండోర వేయించారు. దైవభక్తితో గ్రామంలో మినరల్ వాటర్ ఉచితంగా అందించిన మురాషాకు ప్రజలు అభినందించారు.

పీలేరులో: పీలేరు మండల ప్రజలు శని, ఆదివారాల్లో వినాయక చవితి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా విఘ్నేశ్వరుడు కొలువుదీరిన మండపాలను, ఆలయాలను ప్రజలు కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చాలా మంది మహిళలు వివిధ ఆలయాల్లోని నాగుల పుట్టలకు పాలు పోసి, నోము దారాలు చుట్టారు. వినాయక చవితి సందర్భంగా ఈ ఏడాది పీలేరు మండలంలో 186 కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో రెండవ రోజైన ఆదివారం ఆయా మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. అత్యధిక కేంద్రాల్లో అన్నదాన కార్యక్రమాల్లో ముస్లింలు కూడా భాగస్వామ్యులై మతసారస్యాన్ని చాటుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పీలేరులోని బ్రాహ్మణ సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం నిర్వహించారు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురంలోని భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద గార్గేయ నదిలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, సభ్యులు నరసింహమూర్తి, తెనాలి రామసుబ్రహ్మణ్యం, రిటైర్డు బ్యాంకు మేనేజర్ విరూపాక్షం కాశీనాథ్, సూత్రం కిరణ్ కుమార్ శర్మ, టీవీఎస్‌ఆర్‌కే ప్రసాద్, విరూపాక్షం విశ్వనాథ్, విరూపాక్షం ఉదయ్ చంద్, ప్రభాకర్ రావు, శ్రీనివాసులు, శ్రీధర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమజ్జనం: పీలేరు పట్టణంలో సోమవారం గణేశ్ నిమజ్జనానికి ఏర్పాటు చేసినట్లు గణేశ్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వారణాశి మోహన్ రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణంలోని 90 కేంద్రాలతోపాటు పరిసర ప్రాంతాల్లోని కేంద్రాల వారు పీలేరు పట్టణంలో జరిగే నిమజ్జన ర్యాలీలో పాల్గొనేందుకు పోలీసుల అనుమతి తీసుకున్నారని ఆయన తెలిపారు. ప్రతి కేంద్రం వారు తమ ప్రాంతం నుంచి నెహ్రూబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పోలీసులు, ఉత్సవ కమిటీ వారు అందించే టోకెన్ల ప్రకారం నిమజ్జనంలో పాల్గొనాలని సూచించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శనివారం వినాయక చవితి పండుగ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామ గ్రామాన ప్రతి ఇంటా మట్టి వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని తోట వీధి, కొత్తపేట వీధి, ఇందిరమ్మకాలనీ, గాంధీపేట, జెట్టిపాళ్యం, బజారు వీధి, చాకలవీధి, పింగాణి, ఫ్యాక్టరి, తదితర ప్రాంతాలలో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి వైభవంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ దేవాలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీహరి బందోబస్తు నిర్వహించి వేడుకలను పర్యవేక్షించారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకుంటున్నారు. శనివారం ఉదయం నుంచి ఆయాగ్రామాల్లో వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. పలు గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుల కోసం ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి విభిన్న రూపాల్లో గణేశ్ విగ్రహాలను కొలువుదీర్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీటీఎం మండల కేంద్రమైన మైన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం నాయకుడైన మలిగి మధుసూదన్‌రెడ్డి రూ.30 వేలు వెచ్చించి విగ్రహాన్ని వితరణ చేయడంతో యువకులు భక్తి శ్రద్ధలతో వినాయక పూజలు నిర్వహించుకున్నారు. వినాయక చవితి వేడుకల్లో చింతకాయల వినోద్, గంగాద్రి రెడ్డెప్ప, సాయి, రాజేష్, రెడ్డిప్రసాద్, పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మండపాలను విద్యుద్దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. రామసముద్రం మండల కేంద్రంలోని ఎగువ దళితవాడలో 20అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

కురబలకోటలో: కురబలకోట మండలంలో వాడవాడలా వినాయక చవితి పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని అంగళ్ళు, కురబలకోట, ముదివేడు, మట్లివారిపల్లె తదితర గ్రామాల్లో వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, భానుప్రకాష్ రాయల్, అయూబ్‌బాషా, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: వినాయక చవితి సందర్భంగా శనివారం కలికిరి మండలంలో వాడవాడలా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. చాలా చోట్ల సోమవారం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిమజ్జనం చేసే ప్రాంతాలను కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న కారణంగా విద్యుద్దీపాల అలంకరణలో జాగ్రత్తలు పాటించాలన్నారు.


ములకలచెరువులో పూజలు చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి


కలికిరిలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు

గుర్రంకొండలో: వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వాడవాడలా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

కలకడలో: వినాయక చవితి పండుగను మండల ప్రజలు శనివారం వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ, ఎర్రయ్యగారిపల్లె, కోన, బాటవారిపల్లెతోపాటు వివిధ గ్రామాల్లో వివిధ రూపాలున్న వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలను చేశారు. ప్రజలు వారి వారి ఇళ్లలో గణపయ్యలను ఏర్పాటు చేసి పూజలను చేశారు. ఇందులో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిపి అన్నదానాలు చేశారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు, మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పోకనాటి వీధి, బీసీకాలనీ, పీటీఎంరోడ్, బైపాస్‌రోడ్డు, జయశ్రీకాలనీ, శెట్టిపల్లెరోడ్డు, తదితర ప్రాంతాలలో వినాయక మంటపాలు ఏర్పాటు చేశారు. చవితి సందర్భంగా స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో వినాయకుడికి విశేష అలంకరణలు చేశారు. సీఐ రాజారెడ్డి పోలీసు సిబ్బందితో కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ములకలచెరువులో: మండలంలో శనివారం వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక , పోలీస్‌స్టేషన్, మద్దినాయనిపల్లె, గాలేటివారిపల్లె, వేపూరికోట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనారెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు మస్తాన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో వినాయక చవితి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకుంటున్నారు. శనివారం ఉదయం 11గంటలకు చవితి ప్రారంభం కాగానే గౌరీ పుత్రున్ని కొలువు దీర్చారు. పలు గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో విభిన్న రూపాల్లో గణేశుని విగ్రహాలను కొలువు దీర్చి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో పాత కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన లాల్‌బాగ్ వినాయకుడు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాడు. శనివారం సాయంత్రం స్థానిక పాత కళాశాల మైదానంలో గణేశ్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన తోలు బొమ్మలాట అందరిని విశేషంగా అలరించింది. ఐదు రోజుల పాటు నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో 3రోజులపాటు అన్నదానం నిర్వహిస్తున్నట్లు గణేశ్ యూత్ సభ్యులు తెలిపారు.


రామసముద్రం ఎగువదళితవాడలో 20అడుగుల వినాయక విగ్రహం


పీటీఎంలోని చింతకాయల వీధిలో యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడు


నిమ్మనపల్లెలో పూజలు అందుకుంటున్న గణనాథుడు


గుర్రంకొండలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

వినాయక నిమజ్జనానికి భారీ బందోబస్తు


పీలేరు అయ్యపనాయుని చెరువులో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన పోలీసులు

పీలేరు, సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన ర్యాలీకి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాయచోటి ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు. పీలేరు పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన ర్యాలీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రత్యేకమైనది. పట్టణంతోపాటు పీలేరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలన్నీ ఒకేరోజు స్థానిక అయ్యపనాయుని చెరువులో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. పీలేరులో బుధవారం వినాయక నిమజ్జన ర్యాలీ ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డుతోపాటు నెహ్రూబజారు, బ్రాహ్మణ వీధి గూండా నిర్వహించి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తుంటారు. ఈ నిమజ్జన ర్యాలీ బందోబస్తు కోసం జిల్లా కేంద్రం నుంచి అదనపు బలగాలతోపాటు వాల్మీకిపురం, కలకడ, పీలేరు రూరల్ సర్కిళ్ల పరిధిలోని సిబ్బందిని కూడా రప్పిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిమజ్జన ర్యాలీని ఉదయం 10 గంటలకు ప్రారంభించి రాత్రి వీలైనంత త్వరగా ముగించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన పట్టణంలోని వినాయక కేంద్రాల నిర్వాహకులతో పీలేరు ఇన్‌ఛార్జ్ సీఐ రెడ్డిశేఖర రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణతో కలిసి ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు.

అర్హులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం


మదనపల్లె బైపాస్‌రోడ్డులో రాస్తారోకో చేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8: మదనపల్లె సిరికల్చర్‌కాలనీలో అనర్హులకు కేటాయించిన రీలింగ్ యూనిట్ల స్థలాలను రద్దు చేసి, అర్హులకు న్యాయం చేసే వరకు పోరాటం తప్పదని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిరికల్చర్ కాలని వద్ద బైపాస్‌రోడ్డులో బహుజన యువసేన నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ ఆరు నెలల క్రితం సిరికల్చర్ కాలనీలో 11 మందికి రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయించారని, వారిలో ఐదుగురు అనర్హులు ఉన్నారన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం మద్దతుతో అక్రమంగా అనర్హులు రూ.కోట్ల విలువైన స్థలాలు కాజేశారని ఆరోపించారు. ఈ విషయమై ఆరు నెలలుగా పోరాడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. డీఎస్‌వో ఆదేశించినా ఇక్కడ అనర్హులు పనులు చేస్తుండటంపై నిరసనగా రాస్తారోకో చేయాల్సి వచ్చిందన్నారు. కాగా రాస్తారోకోతో బైపాస్‌రోడ్డులో ఇరువైపు వాహనాలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న టు టౌన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ రహీముల్లా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు శ్రీనివాసులు, షెహెన్‌షా, ప్రవీణ్, బహుజన యువసేన నాయకులు జగదీష్, ఆది, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట మార్కెట్‌యార్డ్‌లో టమోటాల కళకళ


బి.కొత్తకోట మార్కెట్‌యార్డ్‌లో టమోటాల యాక్షన్ పాడుతున్న దృశ్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 8: కొన్నేళ్లుగా వ్యాపార కార్యకలాపాలు లేక మూగబోయిన బి.కొత్తకోట మార్కెట్‌యార్డ్‌కు టమోటాల రాకతో ఎట్టకేలకు కళ వచ్చింది. వారం రోజులుగా క్రమక్రమంగా టమోటాలు వస్తున్నాయి. మదనపల్లెకు చెందిన వ్యాపారులు వచ్చి కాయలను కొనుగోలు చేస్తుండటం, చింతామణి, కోలార్ మార్కెట్ల ధరలకు సమానంగా ఇక్కడే అమ్ముడు బోతూ ఉండటంతో చుట్టుప్రక్కల ప్రాంతాల రైతులు బి.కొత్తకోట మార్కెట్ కే టమోటాలను తరలిస్తున్నారు. దీంతో టమోటా లారీలు, కూలీలు, రైతులతో మార్కెట్ యార్డ్ సందడిగా కనిపిస్తోంది. దీంతో పలువురు రైతులు, వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

692 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దమండ్యం, సెప్టెంబరు 8: పెద్దమండ్యం మండలం కుడుమలవారిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 692 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని అబ్దుల్ జలీల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెద్దమండ్యం హెడ్ కానిస్టేబుల్ శ్యాంప్రకాష్ వెల్లడించారు. మండలం లోని పలు గ్రామాలలో రేషన్ బియ్యం సేకరించి ఆటోలో రాయచోటికి తరలిస్తున్న రూ.13840 విలువ కలిగిన 692 కిలలో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

రామసముద్రంలో: మండల కేంద్రం నుంచి కర్ణాటకకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 450కేజీల బియ్యాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు..మండల కేంద్రానికి చెందిన మంజునాథ్ ఆటోలో 20బ్యాగ్‌ల రేషన్ బియ్యం అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఆటోలో ఉన్న బియ్యం సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8: మదనపల్లె మండలం టేకులపాలెం గ్రామ పరిధిలో రైతుతో పాటు, వన్యప్రాణి(అడవి పంది) మృతికి కారణమైన వేటగాళ్లను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణప్ప డిమాండ్ చేశారు. శనివారం టేకులపాలెం వద్ద పొలాల్లో వేటగాళ్లు బిగించిన విద్యుత్ తీగల ఉచ్చు తగిలి రైతు జె.రామచంద్ర మృతి చెందాడన్నారు. సంఘటనా స్థలంలో చూడగా ఒక అడవిపంది కూడా విద్యుత్ తీగలు తగలి విద్యుదాఘాతంతో మృతి చెందిందన్నారు. డివిజన్‌లో చాలా చోట్ల పొలాల్లోకి వన్యప్రాణులు రాకుండా విద్యుత్ తీగలను ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలించి ఉచ్చులు వేస్తున్నారని, దీని వలన వన్యప్రాణులతో పాటు, రైతులు కూడా మృతి చెందుతున్నారన్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు కూడా వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద వారిపై కేసు నమోదు చేయాలని కృష్ణప్ప డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాంబశివ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి పలువురు సంతాపం


మంగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 8 : అనారోగ్యంతో టీడీపీ సీనియర్ మహిళా కార్యకర్త గార మంగమ్మ (55) మృతి పట్ల పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. కమ్మచెరువుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గార మంగమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ దాసిరిపల్లె జయచంద్రారెడ్డి కమ్మచెరువుకు చేరుకుని మంగమ్మ భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపి వారికి మనోధైర్యాన్ని అందించారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నాయకులు కట్టా సురేంద్రనాయుడు, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు సంపతికోట కిట్టన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మొరుసుపల్లె కృష్ణారెడ్డి, హరినాథ్, నరసింహులు, ప్రసాద్‌రెడ్డి, కమ్మచె రువు బాష, రెడ్డిశేఖర్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు యువకులపై కత్తులతో దాడి

కురబలకోట, సెప్టెంబరు 8: ఇద్దరు యువకులపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప(21), నిరంజన్‌రెడ్డి(30)లు డ్రైవర్‌లు. సొంతపనుల నిమిత్తం అంగళ్ళుకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో వాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో వారి మధ్య వాగ్వివాదాలు జరిగాయి. అనంతరం మరో వాహనదారుడు తన వాళ్ళకు ఫోన్ చేసి మరికొంతమందిని పిలిపించుకుని వారిపై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నిమ్మనపల్లి, సెప్టెంబరు 8: మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆదివారం మార్కెట్ యార్డు వద్ద జరిగిన సమావేశంలో అంబేడ్కర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడుగా బొమ్మనపల్లి లక్ష్మన్న, కన్వీనర్‌గా ముబారక్, గౌరవ అధ్యక్షులుగా సహదేవ, సెక్రటరీగా శ్రీరాములను ఎన్నికున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల,మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ మండల కమిటీని ఎన్నుకొన్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎలాంటి సమస్య వచ్చినా తాము ముందుండి పరిష్కరిస్తామని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు రెడ్డిమోహన్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 8: మండ లంలోని వెంగంవారిపల్లి పంచాయతి కొత్త కొండసానివారిపల్లికి చెందిన రౌతు రెడ్డిమోహన్(48) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రెడ్డిమోహన్ తన కుమారుడైన సుదర్శ న్‌కు ఏడాది క్రితం కలకడ మండలం బొంతవారిపల్లికి చెందిన భానుమతితో వివాహం చేశాడు. కొద్ది కాలంగా కోడలు భానుమతి కాపురానికి రాకపోవడంతో అతను ఆమెను మంద లించాడు. దీంతో కోడలు ఆమె తల్లిదండ్రులు వ్యవసాయం పొలంవద్ద ఉన్న రెడ్డిమోహన్‌పై దాడి చేసి చెట్టుకు ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీక రించారని కుమారుడు సుదర్శన్ తెలిపారు. తన తండ్రి ఆత్మహత్య చేసుకునేంత పిరికితనం లేదని తన భార్య భానుమతి తల్లిదండ్రులే చంపినట్లు పిర్యాధులో పేర్కొన్నాడన్నారు. దీంతో అనుమా స్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8: మదనపల్లె మండలం టెకుపాళ్లెంకు చెందిన జె. రామచంద్ర కరెంటు తీగ తగలి మృతి చెందినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. రామచంద్ర తప్పిపోయిన తన మేకలను వెతుకుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలి మృతి చెందాడని పేర్కొన్నారు. దీనిపై దండువారిపల్లె చెందిన నాగరాజ, వేణుగోపాల్, మలేపాడుకు చెందిన కదిరప్ప, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనం ఢీ కొని రైతు మృతి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు8: మదనపల్లె మండలం, వేంపల్లెకు చెందిన రైతు రామమోహన్‌నాయుడు(45) వాహనం ఢీకొని మృతి చెందినట్లు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సొంత పనులపై రామమోహన్‌నాయుడు వేంపల్లెకు ద్విచక్రవాహనంపై వెళుతుండుగా వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

కొనసాగుతున్న ఆప్కాస్ సిబ్బంది నిరసన

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఐదు రోజులగా జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకలుతొ కలిసి ఆప్కాస్ సిబ్బంది నిరసన కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ 13 నెలలుగా జీతాలు లేకుండా పని చేస్తున్నారని వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, నాయకులు మురళి, జ్ఞాన శేఖర్, జమీల్, అప్సాసా తులసి, మృదుల, ఉష, చంద్రిక, గంగాదేవి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ హార్సిలీహిల్స్ నూతనకార్యవర్గం

బి.కొత్తకోట, సెప్టెంబరు 8: లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బి.కొత్తకోట పట్టణంలోని ఆదిత్యకళాశాల వేదికగా జోనల్ చైర్‌పర్సన్ సుబ్బారెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా కోగర మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఇ.మనోజ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా బి.వెంకటరెడ్డి ఎంపికయ్యారు. స్థానిక విద్యా ర్థులు వసుంధర, మౌనిక లకు రూ.5000 చొప్పున స్కాలర్‌షిప్ ను అందిం చారు. కార్యక్రమంలో జి.అరుణ్‌కుమార్, కె.రాజారెడ్డి, గోపీక్రిష్ణ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత కంటి పరీక్షలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8: స్థానిక పట్టణంలో ఆదివారం ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులకు ఉచిత వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపలకృష్ణ, గౌరవాధ్యక్షుడు మునిరత్నమయ్య కార్యదర్శి వీఎం నాగరాజ, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, శకుంతలమ్మ, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ సీనియర్ సిటజన్స్‌కు ఉచిత సేవలు చేయడం ఆనందంగా ఉందన్నారు.

హెచ్‌ఎంకు జాతీయ పురస్కారం

కలకడ, సెప్టెంబరు 8:మండలంలోని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు ఉత్తమ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తిరుపతిలో ఆదివారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసా పత్రం, సన్మానం, జ్ఞాపికను అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కలకడ, సెప్టెంబరు 8:పూర్వ విద్యార్థుల కలయికకు బాటవారిపల్లె హైస్కూల్ వేదికైయింది. 2006-07లో పదవ తరగతి చదివిన 25 మంది విద్యార్థులు ఓచోట చేరారు. విద్యార్థి దశలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన శ్రీనివాసులరెడ్డి, సుమతమ్మలను సన్మానించారు. తమ వంతు సాయంగా పాఠశాలకు కుర్చీలను అందజేశారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, సెప్టెంబరు 8:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం అనవాయితీ. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు మదనపల్లె క్రీడాకారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 8: జాతీయస్థాయిలో అస్సాంలో నిర్వహించే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు మదనపల్లె క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి దిలీప్, మురళీధర్ మాట్లాడుతూ . ఈనెల 11 నుంచి అస్సాం రాష్ట్రం గౌహతిలో నిర్వహించే జాతీ య స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో వారు పాల్గొంటారన్నారు.